కథా నిలయం
6487
శ్రీకాకుళం

# 1
# జిద్దు

పటేలా.....నా సంగతి నీకు తెలుసుగదా. మంచిమాటకు మంచోన్ని. ఒక్కసారి మనసునొచ్చిందనుకో...బంగారు కిరీటాలు పెడుతనన్నా తలదిప్పి సూడ. అంత జిద్దుగాణ్ణి. ఎందుకు చెబుతున్ననంటే మొన్న పంచాది జరుగలేదా. దాని గురించి పటేలా.

నేను అవద్దం మాట్లాడిన్నా...? నిజమే మాట్లాడిన గదా! అందుకే పటేలుతోని సవాలు జేసిన. నువ్వు మసీదు ఎక్కుతవా నన్ను ఎక్కుమంటావా అని. ఇది తప్పంటవా పటేలా! తప్పయితే చెప్పుతోని గొట్టు.

నువ్వు అనుకుంటుండచ్చు! పక్కీరోనికి ఇంతకావురమా... ఊరి ఉపసర్పంచ్‌నే మసీదు ఎక్కుమంటడా అని! భూమయ్య పటేలు ఉపసర్పంచ్ గావచ్చు. ఐతే నాకేంది. పటేలుగానీ, రుస్తుంగానీ, అందరూ ఒక్కటే! ఎట్లన్నా నా మాటనే నడుస్తదని అవద్దమాడితే నేను ఊకుంటనా...?

నువ్వేగాదు పటేలా...! ఐదారుగురు ఇట్లనే అన్నరు.

'అదుక్కతినే కుక్కవు. నీకు ఎంత ఓపిక ఉండాలెరా' అన్నరు. అసలు సంగతి తెలిస్తే ఎవలూ అట్ల అనరు. నేను ఎంత ఓపిక పట్టిన. ఎంత బాదపడ్డా అన్నది చెప్పితే గదా తెలిసేది.

అసలు ఏం జరిగిందో తెలుసునా పటేలా! మా సంగతి తెలుసుగదా. మేము ఐదుగురు అన్నదమ్ములం. ఇద్దరు బొంబాయిలున్నరు. ముగ్గురం ఊర్లె ఉన్నం. మేము మొల్లలమని తెలుసుగదా. పీరీల పండుగు మేమే జేస్తం. మాకు ఇనాం భూములున్నయా... పడావు భూములున్నాయా...? ఊరితోనే బతుకాయె. ఊర్లె ఎవలన్నా కందూరుకు చేస్తే మలీద ముద్దలు సదివిస్తే ఐదో పదో ఇస్తరు. అలాల్ చేస్తే కల్లుకు పైసలిస్తరు. రైతులు కల్లాల దగ్గెర వడ్లు వెడుతరు.

వడ్లు వెదుతరనే ఆశకే ఎర్రటి ఎండల మైలాన్ దేవుని గుట్టమీదికి కందూరు చేసుదుకు పోవాలె. సత్తెపీరీల దర్గ దగ్గరికి, దరేసాబ్ గుట్టమీదికి, ఆదిమలన్ బోరు మీదికి మలీద ముద్దలు సదివియ్య వోవాలె. ఊర్లె పండుగులైనా పబ్బాలైనా ఎవలు పిలిస్తే వాళ్ళింటికిపోయి అలాల్ జేయ్యాలె. కోడినో మేకనో ఏ దేవుని దగ్గర అలాల్ జేసుకుని రమ్మంటే ఆ దేవుని దగ్గర అలాల్ చేసుకుని రావాలె. ఊరు పెద్దది గదా పటేలా! ఒక్కొక్కనాడు తిందామన్నా తీరిక ఉండది.

ఈ పని మేము ముగ్గురం పొత్తులనే చెయ్యాలె. కానీ మా తమ్ముడు లంగ. ఊర్లె దగ్గెరి దగ్గెరి పనులు వాడు సూసుకుంటడు. దర్గా దగ్గర మలీద సదువుదున్నా పోశమ్మ దగ్గరనో మైసమ్మ దగ్గరనో అలాల్ జేసుదున్నా 'నేను రాను. మా అన్నలత్తరు పో' అంటడు. కందూరు జేస్తే మాత్రం కడుపు నిండా తిండి దొరుకుతదని పోతడు.

ఊరంటే కష్టముంటది, సుఖముంటది. బెల్లమచ్చినా వట్టాలె. పెండచ్చినా వట్టాలె. దగ్గరియిపోత. దూరపుయి పోను అంటే నడుస్తదా...? ఊర్లె రైతులు ఊకుంటరా పటేలా! మా అన్న 'వచ్చేకాడ నాడు వోతడు. దూరం మనను పొమ్మంటడు మనం పోనే వద్దు' అంటడు.

"కోట్లాడుకోవద్దు. ముగ్గురం కలిసి చేసుకోవాలె!" అని నేను అంట. మా అన్నకు తమ్మునికి అగ్గి పగ. ఇద్దరూ నా మాట ఇనరు. ఎప్పుడూ కోట్లాటనే.

ఇద్దరు ముగ్గురు పటేండ్లు 'వారీ... మీకు పొత్తు కుదురదిరా...యాడాదికి ఒక్కలు చేసుకోండ్రి' అన్నరు. మా అన్న తమ్ముడు గూడా 'అవును' అన్నరు. నాకే మనుసు ఒప్పలేదు.

'ఒక అయ్యకు పుట్టినం. ఒక ఇంట్ల పెరిగినం. ఒక్కటిగా కలిసుందాం. పీరీల పండుగు పొత్తుల జేత్తాం. అలాల్ జేసే పనిగదా...? రైతులు ఎవల దగ్గెరికత్తే వాళ్ళు పోయి అలాల్ జేద్దాం. కల్లుకు పైసలిత్తే తీసుకుందాం. కల్లాల మీద వడ్లను అడుక్కస్తే మాత్రం ఒక్కచోట పోద్దాం. ముగ్గురం పంచుకుందాం' అన్న పటేలా. అది తప్పంటవా...?

ఊరంతా 'సరేరా' అన్నరు. యాడాది రెండేండ్లు అట్ల నడిచింది. అప్పటికి ఎన్నో పంచాదులు పుట్టినయి ఇద్దరికి. నేనే సదురుకస్తున్న. కల్లాల దగ్గర అడుక్కచ్చిన వడ్లు దొంగతనంగా అమ్ముకుంటున్నడని మా అన్న పిరాదు. అలాల్ చేసినప్పుడు రైతుల దగ్గర పైసలు అడుగుతున్నడని, అందుకే కల్లాల దగ్గర వడ్లు పెడుతలేరని మా తమ్ముని పిరాదు.

వాడు నా మీదనే. వీడు నా మీదనే. నాకు కోపమచ్చింది

"చల్...ఎవలంతల వాళ్ళుందాం. యాడాదికి ఒక్కలం చేసుకుందాం. ఒకడి వంతులో ఇంకొకడు కత్తి పట్టద్దు. వడ్లు అడుగద్దు. చాతగాకపోతెనో జరం వస్తెనో కత్తి చేతికిచ్చి పొమ్మంటేనే తప్ప పోవద్దు" నేను జెప్పిన.

ఇదే మాట మీద కట్టడిగా నిలవడ్డం.

మాకు అమాస పున్నాలు లెక్కగాదు. పీరీల పండుగులెక్క. పండుగు ముందు వంతు తీసుకోవాలె. పండుగు జెయ్యాలె. మల్లా పండుగు దాక ఊర్లె మంచిది చెడ్డది చూసుకోవాలె. అలాల్ కందూర్లు చెయ్యాలె. వడ్లు అడుక్కోవాలె. అదీ మా లెక్క.

ఊరు కడుపు సల్లగుండ పటేలా! పొట్టకు తుట్టి లేకుంట నడిచింది. సంకురాత్రికి యాకాశికి అప్పాలు దొరుకుతయి. ఉగాదికి పోలెలు దొరుకుతయి. దసుర,ఓళి పండుగులప్పుడు కల్లునీళ్ళకు పైసలు దొరుకుతయి. ఎవలకు అలాల్ చేసినా కల్లు తాగుమని రెండు రుపాయలిత్తరు. కల్లాల మీద రెండు పుట్ల వడ్లు దొరుకుతయి పటేలా. ఓపిక ఉండి తిరుగాలెగానీ ఇంకో పందుము వడ్లు ఎక్కువనే దొరుకుతయి.

ఊరు పెద్దది గద పటేలా! పనిగూడా బాగనే ఉంటది. ఇయ్యల్ల రేపు అలాల్ లేనిది కోడి,గొర్రె ఏదీ తెగుతలేదు. కొన్ని కాలాలైతే అసలు ముడుదారే ముట్టరు. పట్టపగలు ఒకడచ్చి మైసమ్మ దగ్గెర కోడిని కోసుక రావాలంటడు. అక్కడికిపోయి వస్తనోలేదో ఇంకొకడు వచ్చి ఇప్పల్ల పొలిజెయ్యాలె నడువు సడువు అంటడు.

అక్కడి నుంచి ఇంటికి రాకముందే ఇంకొకడు తొవ్వల కలిసి 'ఎటు పోయినవురా... పొద్దటి నుంచి దొరుకుతనే లెవ్వ. సుట్టాలచ్చింద్రు. ఇంటి దగ్గర కోడి గొయ్యాలె నడువు' అంటరు.

తిండిలేదు తిప్పల్లేదు. అక్కడినుంచి ఇంటికస్తనో లేదో...ఇంకొకలు కావలుంటరు. ఒక్కొక్కనాడైతే రాత్రంతా నిద్ర ఉండది.

ఇంటున్నవా పటేలా... నా కత. మీ కల్లం దగ్గరికచ్చి దోసెడు వడ్లు పెట్టుమంటే ఈ చేనుకాడ గాదు ఆ చేనుకాడంటరు. అక్కడికిపోతే ఇంకోచేను కాడంటరు. కొందరైతే వీడు ఏంకట్టం చేసిండని వడ్లు పెట్టాలె అంటరు.

ఈ కత ఇట్లున్నదంటే భూమయ్య పటేలు కతజూడు. ముచ్చట్లవడి అసలు సంగతి మరచేపోయిన. పటేలుతోని పంచాది పెట్టుకోవాలని నాకేం లేదు. కానీ వట్టి వట్టిగ బట్టగాల్చి మీదేసె.

పటేలుకు నాకు ఇప్పుడు గాదు. అర్నెల్ల కిందనే మాటచ్చిందని చెప్పినగదా! అప్పుడు చిన్న బిడ్డలగ్గం జేసిండు పటేలు. బల బల తెల్లారుతుండంగ నా దగ్గెరికచ్చిండు.

'వారీ శేరెల్లీ... బిడ్డ లగ్గముంది. నాలుగు గొర్లు అలాల్ జెయ్యాలెరా' అన్నడు.

మామూలుగా అయితే ఇసొంటి పెండ్లి కార్యాలకు రెండు మూడు రోజుల ముందే చెప్పుతరు. ఎందుకంటే ఊరికో పల్లెకో పోతరు గదా అని. ఈ పటేలు నాకు అట్లగూడా చెప్పలేదు.

ఇంకో ముచ్చట. నా కోడలు బరువు మనిషి. కొడుకు ఇంట్లలేదు. కోడలు పిల్ల అదే రాత్రి ఆపదివడ్డది. నొప్పులచ్చినయి. రాత్రికి రాత్రి జీబును కిరాయి మాట్లాడి, మా భార్యను ఇద్దరు ముగ్గురు పక్కింటోళ్ళను బతిమిలాడి దవాఖానకు పంపిన.

నేను గూడా ఎంట పోయేదుండె. ఊర్లె ఈ భూమయ పటేలు పెండ్లి కార్యముండె. మా అన్నకో తమ్మునికో చెప్పి పోదామంటె వాళ్ళు ఊర్లె లేరు. కార్యం ఒడ్డెక్కాలెగదా. అందుకని ఇంటి దగ్గరనే ఉన్న. కోడలు ఎట్లుండెనో ఏమాయెనో అని పాణం తల్లడమల్లడమైతుంది. తానం జేసి కత్తి నూరుకుని పటేలు ఇంటికి పోయిన.

గొర్రెపోతులు చూసినవా పటేలా...? దున్న పోతుల లెక్కున్నయి. ముదిరిపోయినయి. అస్సలు తెగయి. గొర్రెల కాళ్ళు పట్టుకునేది ఎవరనుకున్నవు....? సాకలి మల్లిగాడే! వాడు కావాలనే చేసిండో...జారిపోయిందో గని మెడమీద కత్తిపెట్టి కోసేటప్పుడు గొర్రెను ఇడిసిపెట్టిండు.

గొర్రె పెండ్లాం ముండవొయ్య ఒక్కటే దుంకుల లేచి నిలవడ్డది. లేత్త లేత్తనే తలికాయతోని నా కడుపుల గుద్దింది. ఇంకా నయం. కార్యాల పట్టుకు తాకితే సచ్చిపోయేటోన్ని. అట్లనే ఇరుసుకపడ్డ.

ఉరుకుతున్న గొర్రెపోతు ఎంటవడ్డరుగనీ 'అరే...పక్కీరోడు ఇరుసుక పడ్డడని' ఒక్కడు లేవట్ట లేదు. అట్లుంది నా బతుకు. నేనే మొండికి లేచికూసున్న.

అట్లనో ఇట్లనో గొర్లను అలాల్ జేసిన. మామూలుగా అయితే అలాల్ చేసినందుకు పైసలు తీసుకోను. దయపుట్టి వాళ్ళే కల్లుకు పైసలిత్తరు. బోజినానికి రమ్మంటరు. గంటసేపు అక్కడనే కూసున్న పటేలా. కల్లుకు ఐదు పైసలియ్యలేదు. పొంటె జాముకు దొర్సాని 'వారీ....అప్పటికి బోజినానికి రారా' అన్నది. సరే అనుకుని ఇంటికి పోయిన.

ఇంటి దగ్గర కత జూడు. నేను పోయే సరికే ఇద్దరు కావలున్నరు. ఒకలేమో దర్గ దగ్గరికి రావాలంటడు. ఇంకొకడు ముత్యాలవ్వ దగ్గెర కోడి పిల్లను కోసుకరావాలంటడు. ఇద్దరికీ తొందరనే! నా ముందటే పంచాది పెట్టుకున్నరు.

అంతవరకు నేను నోట్లె మంచినీళ్ళు పొయ్యలేదు. దర్గ దగ్గెరికి రక్తం బట్టలతోని పొవద్దాయె. ముత్యాలవ్వ దగ్గెర కోడిని కోసుకచ్చి నాలుగు చెంబుల నీళ్ళు బుడబుడ మీద పోసుకుని తడి బట్టలతోనే దర్గా దగ్గరికి పోయిన. ఎంత లేదన్నా మూడు మైళ్ళు. మలీద సదివిచ్చి తిరిగచ్చేసరికి పొద్దు నెత్తిమీదికచ్చింది.

ఆకలైతుంది. దొర్సాని బోజినానికి రమ్మనె. సక్కగా భూమయ పటేలు ఇంటికి పోయిన. అరుగంచుకు నిలవడ్డ. నన్ను పిలిచినోళ్ళు లేరు. పెట్టినోళ్లు లేరు. సూత్త సూత్తుండంగనే బోళ్ళు బోర్లేసింద్రు. పటేలు నాలుగైదుసార్లు నా ముందు నుంచే వచ్చిండు పోయిండు గనీ తిన్నావురా అనలేదు.

పటేలవ్వనే అటు వచ్చినప్పుడు 'తిన్నావురా శేరెలీ' అన్నది.

'యాడనవ్వా....ఇప్పుడే వచ్చిన' అన్న.

'ఇంక జరాగినంక రావద్దా...నువ్వు వత్తవని ఉట్టిమీద దాచిపెడుత. అందరోలే నువ్వు అప్పుడే

వచ్చి తినిపోతే మంచిగుండు గదా' అన్నది కోపంగా.

నా బొక్కలిరిగినయి పటేలా! పెండ్లయిన ఇల్లు. నాకు పెట్టుడుకు పిడికెడు మెతుకులే ఉండయా...? అక్కడనే భూమయ పటేలున్నడు. అదుగో బొడుగో సూడు. బుక్కెడు పెడుదాం అనచ్చు గదా. నోరు తెరువలేదు.

అడుక్కతినేటోన్ని. రేషం ఉండద్దుగదా. నేను తొందరపడలేదు. 'సరే తియ్యవ్వా... ఆడిపిల్ల పెండ్లి గదా. ఆగముంటది. వంద మంది అనుకుంటే రెండు వందలత్తరు. కార్యం ఎల్లాలెగదా!" అన్న మాట వోకుంట.

అటో ఇటో కల్లాల దినమచ్చింది. అవి యాసంగికల్లాలు. వానలు లేక వానకాలం పంటలు పండలేదు. వానకాలం మా తమ్ముని వంతు. అప్పుడు పంటలు లెవ్వని ఇప్పుడు సగం వడ్లు ఇయ్యిమంటుండు. నలుగురు ఎట్ల జెప్పితే అట్ల. అంతకు ముందు పంటలు ఇరుగ పండిన్నాడు బిచ్చం ఎక్కువనే దొరికింది. నాకు పంచిచ్చిండా? నేను అవుననలేదు. కాదనలేదు. వడ్లు మాత్రం వసూలు చేస్తున్న.

మొదలు మొదలు భూమయ పటేలు కల్లం దగ్గెరికే పోయిన. 'ఇక్కడ గాదు. ఎల్లుండి వాగుల దొయ్యలకు రా' అన్నడు. వాగుల దొయ్యలంటే ఇక్కడనా అక్కడనా! ఊరి పొలిమెర దాటాలె.

తరువాయిన కల్లాలుగూడా ఉండయి. ఒక్కటే పొలం. అయినా సరే అనుకున్న. అన్నట్టే ఎర్రటి ఎండల వాగవుతలికి పోయిన. పోయేసరికి రాశి చేసింద్రు. నిండు రాశిమీద నాకు పెట్టుమంటే పెడుతరా! రాశి కొలిచే దాక చెట్టు కింద కూసున్న. నా సొపతికి బైండ్లోడు, బట్టోడు,తమ్మలోడు, సుంకరోడు వచ్చికూసున్నరు.

" అరేయ్...ఇక్కడ ఎవనికొక్క ఇత్తువెట్ట. ఎల్లుండి ర్యాగట్ల చేన్లకు రాండ్రి" అన్నడు పటేలు. కల్లం అడుగులు నూకుతూ.

లగ్గం నాడు బుక్కెడు తిండి వెట్టకపాయె. మొన్న ఆ కల్లం దగ్గెరికి పోతే ఇక్కడికి రమ్మనె. నన్ను గాదు వీళ్ళను అంటుండనుకున్న. వీళ్ళందరు పోయినంక నాకు పెడుతడనుకున్న.

అందరు ఎళ్లిపోయింద్రు. నేను మాత్రం అక్కడనే కూసున్న.గంట రెండు గంటలు గడిచింది. పిలువరు పిడికెడు బిచ్చం పెట్టరు. ఆఖరికి పటేలవ్వనే లేచి 'నీకు వేరేచెప్పాలెనారా...చెప్పితే ఇనత్తలేదారా...' అన్నది కోపంగా.

ఇగ నాకు కోపమత్తదా లేదా పటేలా? నువ్వే చెప్పు! అందరిలెక్క వట్టిగ బిచ్చం అడుగుతున్ననా! కష్టం చేసి అడుగుతున్న. అయినా నాకు పెట్టేది ఎన్ని పటేలా. తవ్వెడు... దయవుట్టి పెడితే మానెడు. ఎక్కడ పెట్టినా ముట్టిపాయె... ఒక్కసారి పెడితే మల్లా అడుగుతనా....?

నేను గుడ్ల నీళ్లు గుడ్ల కుక్కుకుంట ఇంటికచ్చిన. ఇగ నువ్వు ఏమన్నాసరే! నేను భూమయ

పటేలు కల్లం మొఖమే సూడలేదు. ర్యాగట్ల చేన్ల రెండు మూడుసార్లు కల్లం ముందటి నుంచే పోయినగనీ ఆగలేదు.

నాకుతెలుసు. ఇప్పుడు గాకున్నా ఎప్పుడైనా పటేలు నా దగ్గరికి వత్తడని. ఎందుకంటే పటేలు పెద్దబిడ్డ బరువు మనిషి. పుట్టిన బిడ్డకు పురుడు జెయ్యాలెగదా! నేను అనుకున్నట్టే అయింది. నెల నిండకముందే మనుమడు పుట్టిండు.

ఇరువయొక్క దినమచ్చింది. మబ్బులనే వచ్చిండు పటేలు. బయట నుంచి పిలిచిండు. పిలుపు వినంగనే మనుసు కుతకుత ఉడికింది. తలుపుగూడా తియ్యలేదు. దర్గా దగ్గరికి పోయిండని చెప్పుమని నా భార్యకు చెప్పిన. పగటి యాల్లదాక అక్కడనే ఉంటడని చెప్పుమన్న. దర్గా ఇక్కడనా అక్కడనా! మైలాన్ దేవుని బండమీద. రెండు మూడు మైళ్ళు. 'తిరుగని కొడుకు. పిడికెడు బిచ్చం పెట్టడా' అనుకున్న.

పొద్దుపొడిచి మూరెడు ఎక్కినంక ఎగపోసుకుంట వచ్చిండు పటేలు. నేను చూసిగూడా సూడనట్టే కూసున్న.

"అరే...యాడున్నవురా..బండంత తిరిగిన కనవడలేదు." అన్నడు కోపంగా.

ఏమీ తెలువనట్టు " ఎందుకుపటేలా..ఏం పని" అన్న. పురుడు ఉందని రెండు మేకపోతుల్ని అలాల్ చెయ్యాలని చెప్పిండు. చెప్పుకుంటనే "జెట్టనరారా...ఇప్పటికే లేటయింది." అనుకుంట పోతనే ఉన్నడు.

నాకు మండుకచ్చింది. 'పటేలా' అని పిలిచిన. భూమయ పటేలు ఎనుకకు తిరిగిండు.

" వెయిలు ఖర్సువెట్టి పండుగు జేస్తరు. మాకు ఒక్క రూపాయి ఇచ్చుడుకు సత్తరు. మేము మీ ఇంట్ల పండుగుందని ఊరికిపోక పల్లెకు పోక ఆపదున్నా సంపతున్నా ఎప్పుడత్తరో అని ఎదురు సూసుకుంట ఇంటి దగ్గరనే పడుండాలె. మీరు మాత్రం పైసలు ఒదులనియ్యరు. మ్యాకకు ముప్పయిరూపాయలు. రెండు అంటున్నవుగదా! తక్కువల తక్కువ యాభై రుపాయలిస్తే వస్త. లేకుంటే లేదు." కచ్చితంగా అన్న.

పటేలు నోరు తెరిచిండు. నాభార్య ఇంట్ల నుంచి ఉరికచ్చింది. ఈ కతంతా దానికేం తెలుసు. 'అరే...పటేల్‌కే సామ్నే ఐసా బోల్తే...నక్కో నక్కో...కర్‌కే అవో...క్యాబాత్ కర్రే' అన్నది భయంగా.

"సువ్వర్..తు గప్‌చుప్‌బైటో... క్యామాలుమై తుమారాకూ...' అన్న గదిరిస్తూ

ఏమనుకున్నడో పటేలు. తువ్వాల దులుపుకుంట కోపంగ పోయిండు. పోతే పోని. ఎంత దూరం పోతడు. మల్లా వస్తడనుకున్న.

నేను మాత్రం తప్పులవడద్దు. అందుకే తానం జేసిపోయి కచీరు దగ్గర కూసున్న. ఎందుకంటే నేను కనవడలేదనుకో...కావాలనే ఎక్కడికో పోయి కార్యం బంగం చేసిన్నని నిందలేస్తరు. అందుకనే

అందరిని చూసుకుంట అక్కడ కూసున్న. పటేలు నా ముందు నుంచే నాలుగైదు సార్లు ఆగమాగం తిరిగిండు. నేను చూసి గూడా చూడనట్టే కూసున్న.

అరగంట గంట గడిచింది. కటికె రాజం నా దగ్గరికచ్చిండు. పాపం వాడు మంచి మనిషి. మ్యాకను అలాల్ చేసినప్పుడల్లా పిడికెడు కూర వెదుతడు. కల్లు సీసకు పైసలిత్తడు.

వాడు వస్తవస్తనే ' ఏంటిదే చీచా... బక్క భూమయ రమ్మంటే రానన్నవట '. అన్నడు. చూసినవా పటేలా. బదునాం రానేవచ్చే. వానికి ఈ కతంతా చెప్పిన. వాడు పటేలును తిట్టుకుంట 'అందుకేనా... ఇరువై రూపాయలిచ్చి నిన్ను తోలుకరమ్మన్నడు' అన్నడు.

'యాభైకి ఐదుపైసలు తక్కువ ఇచ్చినా రాను' అని చెప్పిన. వాడు ఎల్లిపోయిండు

వాడు ఏం చెప్పిండో గని 'నూరు రూపాయలు పోయినా సరే! వాడు మాత్రం రావద్దు' అని మా తమ్ముని దగ్గరికి అన్న దగ్గరికి పోయి బతిమిలాడిండట. ఇంకా ఇద్దరు ముగ్గురు తురుకలను కలిసిండట.

వాళ్ళు ఎట్ల వస్తరు పటేలా. మాది కట్టడంటే కట్టడే! మాట తప్పుడుండది. ఎప్పుడన్నా వీలుగాకుంటే నేను పోయి చెప్పితెనే వస్తరు. చెప్పుడంటే వట్టిగ చెప్పుడు గాదు. కత్తిని మెత్తగ నూరి చేతి కిస్తెనే వస్తరు.

అటు తిరుగ ఇటు తిరుగ తొమ్మిది గొట్టింది. చివరికి నా దగ్గరికి రాక తప్పలేదు. పటేలుకు వచ్చే మొఖంలేదు. యాభై నోటు పట్టుకుని కటికె రాజమే వచ్చిండు. పోయి రెండు మేకల్ని అలాల్ చేసి వచ్చిన.

అది పటేలా...జరిగిన కత. అప్పటినుండి నామీద పగవట్టిండు. మాట మంచిగనే మాట్లాడుతుండుగనీ లోపల కోపం బెట్టుకున్నడు. ఇక అసలు కథయాడ ముదిరిందో చెప్పాల్నా పటేలా!

మొన్న గిరిరాజ్ కోడి..... పెద్దది, దగ్గెర దగ్గెర నాలుగైదు కిలోల బరువుది. సంచిలేసుకుని నా దగ్గెరికచ్చిండు. ఆరోజు నాకు సలి జరమచ్చింది. వణుక్కుంట మంచంల నుంచి లెవ్వలేదు.

'వారి...శెరెల్లీ... ఉన్నావురా...' అన్నడు పటేలు. నేను మూల్గుకుంటనే బయటకచ్చిన. కోడిని మత్తడి పోశమ్మ దగ్గర అలాల్ చేసుక రావాలని చెప్పిండు. మత్తడి పోషమ్మంటే ఇక్కడ గాదు. అక్కడ గాదు. ఊరుకూరు దాటి పెద్ద చెరువు కట్ట కొమ్ముకుపోవాలె.

'సాకలోన్ని రమ్మనద్దా పటేలా..అక్కడనే కోసి పొతంజేసుకత్తుండే' అన్న వణుక్కుంటనే. సాకలోడు వస్తే సైకిల్ మీద పోవచ్చని ఆశ.

సాకలోల్లు మంగలోల్లు పని చెప్పితే ఇంటున్నార్రా... నువ్వు తలికాయ మొండెం

తప్పదీసుకరా...కోసుడు నేనే కోసుకుంట. వట్టిగనే అనుకోకు. నీ కట్టం ఉంచుకోను" అన్నడు.

నేను అదే జరం మీద కత్తి నూరుకున్న. తానం జేసిన. అసలే సలి జరం. పెయ్యిమీద నీళ్ళు పడేసరికి మరింత సలి అందుకుంది. నా భార్య,కోడలు తానం ఎందుకు....? మొఖం మీద నీళ్ళు సల్లుకుని పొమ్మన్నరు. నేను ఇనలేదు. నియ్యతు ఎంతనో బరుకతి అంత. అది మా నాయిన నేర్పిండు.

ఎప్పుడైతే నెత్తిమీది నుంచి తానం జేసిన్నో అప్పుడే సలి అందుకుంది. గొంగడి చెద్దరు బొంత ఏది కప్పినా ఆగుతలేదు. ఇప్పుడెట్ల...? ఇంటిముంగట కోడి ఉండె. కోసి ఇయ్యకపోతే మాటత్తది. పోదామంటే సలి జరమాయె.

అట్లనే వణుక్కుంట మా తమ్ముని దగ్గెరికి పోయిన. వాడు ఊరికి పోయిండట. అన్నదగ్గెరికి పోయిన. అయినకు ఏదో పనున్నదట. పోను అన్నడు. నాకు కాళ్ళు రెక్కలు సల్లవడ్డయి.

'అరే...ఏమైతదిరా...పటేలు సూడచ్చిండా. పోశమ్మ దాక ఎందుకు...? ఇంటి దగ్గరనే కొసియ్యి' అన్నడు మా అన్న.

నాకు కోపమచ్చింది. అందుకే నీకు బరుకతి లేదు. చాటకు తౌడంటుతలేదనుకున్న. సంచిని పట్టుకున్న. వణుక్కుంట వణుక్కుంట సక్కగ చెరువు కట్ట ఎక్కిన.

పొద్దటి పూటనే అది. ఏడెనిమిది అయితుండచ్చు. కోడి కుయికుయి మంటంది. నాకు నడువ చాతనైతలేదు. ఎక్కడన్నా పడిపోతనా అనిపిస్తుంది. పాణం సొలుగుతుంది. కండ్లల్ల తిరుగుతుంది.

అటో ఇటో సంచి వట్టుకుని గుడి దగ్గెరికి చేరుకున్న. సంచిని ఇప్పిన. కోడి కాళ్ళను అందుకున్న. చెర్లకు దిగి నోట్లె తీర్థం పోసిన. కోడి పెద్దగుంది. పట్టుకుంటే చెయ్యి గుంజుతుంది. కోడిని గుడి ముందుకు తెచ్చిన. నిజానికి ఇంకొకరు కాళ్ళు రెక్కలు పట్టుకుంటే నేను మెడ మీద కత్తివెట్టి... అది గూడా ఇష్టమున్నట్టుకాదు. కత్తిని నడుమల వెట్టి మంత్రం సదువుకుంట ఒకసారి కత్తిని అటూ ఇటూ అనేసరికి గాలిగొట్టం తెగాలె. కత్తిని పక్కనపెట్టి మెడలు ఇరిసి దూరం ఇసిరి కొడితే ఖతం.

కాళ్ళ కింద కోడి కాళ్ళను పెట్టుకున్న. ఎడమచేత రెక్కల్ని అనుగవట్టి సాగదీసిన. కుడి చేత కత్తివట్టిన. నేను జరమచ్చిన మనిషిని. కాళ్ళు చేతులు వణుకుతున్నయి. కోడి మామూలు కోడి గాదు. రెపరెప రెక్కలు గొట్టింది. నా కండ్లనిండ దుమ్ము. చేతుల నుంచి జారిపోయింది. అక్కడికీ నేను గట్టిగనే పట్టుకున్న. రెండు పిడికిళ్ళ బూరు చేతుల మిగిలింది. రెపరెపమని కోడి ఎగిరి చెట్టెక్కింది. కో..కో...ఓ... అని ఒక్కటే బొబ్బ.

ఇగ ఎట్లా? నేను అందుకుందామని అటు ఇటు తండ్లాడితే రెప రెప రెక్కలు గొట్టుకుంట ఎక్కడనో మాయమయింది. నాకు జరం మరింత ఎక్కువయింది. అటూ ఇటూ అంతటా జూసిన. ఇంటికచ్చి మలుసుక పన్న. గంటకో అరగంటకో భూమయ్య కోడి సంగతి తెలిసి గరానికచ్చిండు.

'వారీ..అది నా ఇంట్ల పుట్టింది గాదు. సోమారపు అంగట్ల లంబడోళ్ళ దగ్గర కొన్న. అసొంటి కోడినన్నా కొనుక్కరా...లేకుంటే ఐదు వందలన్నా ఇయ్యి. ఇంటికి సుట్టాలచ్చిరి. వాళ్ళకు ఏం వండాలె. ఇజ్జత్ దీస్తివి గదరా....నీ తల్లి...' అంటూ తిట్లు అందుకున్నడు.

ఐదువందలనంగనే నా చలి ఎటువోయిందో జరం ఎటువోయిందో...గొంగడి కొప్పెర పెట్టుకుని సక్కగ చెరువుకట్ట ఎక్కిన. కట్టకిందనే ఎడ్ల దొడ్లు గడ్డివాములు. అన్నీ తిరిగిన. అయినా లాభంలేదు.

ఇగ నా గోస చెప్పరాదు పటేలా. జరమచ్చిన పాణం. తిరిగి తిరిగి బేజారైన. కడుపుల దయ పుడుతదని పటేలును బతిమిలాడుకున్న. ఎన్నడు ఏడువనిది నా భార్య గూడా ఏడ్చింది. పటేలవ్వ కాళ్ళు మొక్కింది. కోతకో మోతకో రెండు మూడు రోజులు కైకిలి వత్తనన్నది.

పటేలు కరుగనేలేదు. ఆనాటిముచ్చట గుర్తుజేసిండు. పైసలు ఇచ్చుడిచ్చుడే అన్నడు. ఇయ్యకపోతే బజార్ల పిలిచి పంచాది పెడుతనన్నడు. పంచాది అంటేనే నాకు భయమయింది. పంచాది పెడితే మాత్రం వెయ్యి రెండు వెయిలు జురుమాన తప్పదనుకున్న.

నాకు కోపం రాకపోతుండే పటేలా! ఇంకా అయ్యా అప్పా అనే బతిలాడుదుంటి. పటేలు ఏమన్నడో తెలుసునా...కోడిని నేనే కోసుక తిని పోయిందని అవద్దమాడుతున్ననట. నేను అటువంటి మనిషిని గాదు. సావనైనా సత్తగనీ అవద్దమాడ. పటేలు నామీదనే దొంగతనం పెట్టె.

ఇగ నాకు కోపమచ్చింది. 'పంచాది లేదు కొట్లాటలేదు. ఐదువందలు అడిగినవు గదా! పారెత్త పో" అన్న కోపంగా. పటేలు అదే పట్టుకున్నడు.

ఈ కత ఇట్లుంటే తెల్లారి యాకాశి. కూరుకు రాత్రి నుంచి పదిగొట్టేదాక తీరికనేలేదు. ఇటువంటి పెద్ద పండుగులకు మేము ముగ్గురన్నదమ్ములం కలిపి చేస్తం. మా అన్న, తమ్ముడు, యాభై దొరికితే పదే దొరికినయంటరు. దొరికిన మటన్‌ల బొక్కలు తెచ్చి పొత్తుల కలుపుతరు. మెత్తటిముక్కలు మాయంజేస్తరు. నేను అట్లగాదు పటేలా!

ఊరు మీద అవద్దమాడద్దు. యకాశినాడు మనిషికి ముప్పయి రూపాయలు. అద్దకిలో కూర దొరికింది. నా రంది నాకుంది. కడుపులకు బుక్క జారుతలేదు. తప్పిపోయిన కోడి యాదికత్తుంది. రేషానికి ఐదువందలు ఇత్తనన్నగనీ ఎక్కడన్నా కోడిదర ఐదువందలుంటదా పటేలా!

ఏమన్నగాని...ఇంకోసారి చూసి వద్దామనుకుని తెల్లారి మబ్బుతోనే చెరువు కట్ట ఎక్కిన. ధర్మమే జయం. పాపం దాగుతదా పటేలా ! ఆయాల్ల చెరువు కట్టమీద మంగలి లింగం కలిసిండు.

'ఏంరా...లింగా లెవ్వంగనే కట్టమీదున్నవు" అని అడిగిన. వాడు నా వందున దేవుడేఅనుకోవాలె. ఆ కట్టమైసమ్మ తల్లె వాని కడుపుల సొచ్చిందనుకోవాలె.

'ఏంలేదు చీచా..బైలుపెట్టింది' అన్నడు వాడు.

'అంత తిన్నావురా...అరుగనిది ఎందుకు తిన్నవు' అని అడిగిన నవ్వకుంట.

"ఏదో తియ్యే...నిన్న యాకాశిగదా! అదుక్కతినే పండుగు. భూమయ పటేలు ఇంట్ల కోడికూర ఏసింగ్రట. నాలుగు వక్కలు కల్లుల తిన్న. అంతే! రాత్రికి రాత్రే అందుకుంది చీచా' అన్నడు.

నాకు పటేలు కోడి బొచ్చెల మెరిసింది. ఇగ ముందుకు పోలేదు. ఎనుకకు తిరిగిన. సక్కగ ఊర్లెకు పోయిన. నాలుగు చికెన్ సంటర్లల్ల తెలుసుకున్న. భూమయ పటేలు చికెన్ తీసుకపోలేదని చెప్పింగ్రు. ఇద్దరు కటికోళ్లను అడిగిన. ఒకల దగ్గర కిలో మటన్ పావుకిలో బోటీ తీసుకపోయిండట.

నాకు అనుమానం వచ్చింది. పూర్తి వివరం తెలుసుకోవాలె గదా! భూమయ ఇంటి సాకలోని దగ్గరికిపోయి మాట మీద మాట తీసిన. నిన్న యాకాశిగదా! ఏం తిన్నవు..? ఏవలేం ఏసింగ్రని నవ్వకుంట అరా తీసిన. వాడు నన్ను బామ్మర్ది అంటడు. నేను బావా అంట. అందుకే వివరాలు తెలుసుకునుడు తేలికయింది. వాడు భూమయ పటేలు పెద్ద పెద్ద ముక్కల చికెన్ ఏసిండని చెప్పిండు.

పటేలా...నాకు పాణం దస్సుమంది. చికెన్ సంటర్లల్ల కొనుక్కపోని చికెన్ ఎక్కడిదన్న అనుమానమచ్చింది.

ఆ రోజు అందరు పండుకున్నంక భూమయ పటేలు ఇంటెనుకకు పోయిన. చిమ్మన చీకటి. నా చేతిలో లైటుంది. ఆయాల్లన ఎవలన్నా చూస్తే నేను దొంగతనానికి వచ్చిన్నని ఈపు సాపుజేత్తరు.

బయం బయంగనే పెరడంతా వెదికిన. పెంటలో కనిపించింది పటేలా కోడిబూరు. దగ్గర దగ్గర తట్టెడుంటది. పెద్ద ఈకెలు. నాకు బాగాయాదికుంది. అదే రంగు. తెల్లగ ఎర్రగ మచ్చలు.

మెల్లెగ బయటకచ్చిన. నా మనసు కుతకుత ఉదుకుతుంది. తల్లితోడు సుమా...కండ్లల్ల నీళ్ళు తిరిగినయి పటేలా.

సక్కగ ఇంటికి వచ్చి పండుకున్న. నిద్రపడుత లేదు. ఎట్లా...? ఎవలకు జెప్పాలె. ఎంత మోసం...? అనుకున్న. నేను ఒక్కటే నిర్ణయించుకున్న పటేలా. నేను గరీబుగాన్ని. నా మాట ఎవలు వినరు. పటేలునే దొంగంటవారా అంటరు. కింది మీద జేత్తరు. జురుమాన దీత్తరు. రేపు దానం చేసేటోళ్ళు చెయ్యరు. ముల్లుతోనే ముల్లును తియ్యాలనుకున్న.

అనాదు తెల్లారకముందే ఇంటికచ్చిందు పటేలు. ఎందుకంటే పైసలు ఇస్తనన్న రోజు అదే! నేను నోరు తెరువలేదు. సక్కగ మసీదు దగ్గెరికి తోలుకపోయిన. నీ కోడి నీ ఇంటికి రాలేదని...యాకాశినాడు దాన్ని కోసుక తినలేదని మసీదు ఎక్కుమన్న. లేకుంటే నేనన్నా ఎక్కుతనన్న. ఇట్ల గాకుంటే తడిబట్టలతో హనుమండ్ల మీద పువ్వులు పెట్టుమన్న. పాపమే లేకుంటే భయమే లేదని చెప్పిన.

మొదాలు పటేలు లావు లావు ఎగిరిండు. నన్నుమసీదు ఎక్కుమంటావా...? ఎంత కావురంరా నీకు అన్నడు. నా మీదికి మందిని ఎగేసిండు. తన్నేతందుకు మోపు జేసిండు. నేను పెంటల ఉన్న

కోడిబూరు సంగతి చెప్పిన. అంతే ! అయ్యగాని గుడ్లు పచ్చవడ్డయి.

పటేలా...ఇందులో ఏదన్నా తప్పు ఉంటే నన్ను చెప్పుతోని కొట్టుండ్రి. తప్పును దాచిపెడితే అగ్గిని ముల్లెగట్టినట్టేగదా! ఆయిన పెద్దమనిషి గావచ్చు. నాకు పూటకే లేకపోవచ్చు. జిద్దుకస్తే ఊరు ఊరంతా ఒక్కటైనా భయపడ.

'నువ్వా,నేనా...' అనంగనే పెద్దలొల్లి జరిగింది. కోపంతో పటేలు ఎల్లిపోయిండు. పంచాది ఇయ్యల్లటికి వాయిద పడ్డది. ఇప్పుడు అటుదిక్కే పోతున్న పటేలా...ఎక్కతక్క మాట్లాడేది లేదు. ఆయిన ఎక్కుతడా..నన్ను ఎక్కుమంటడా..అంతే! వస్త పటేలా...మళ్ళీ రాత్రి కలుస్త.

*****

ఆరోజు గాంధీ గద్దె దగ్గెర పంచాది.భూమయ చక్రం తింపిండు.

పక్కీరోనికి ఇంత కావురమా..ఇయ్యల్ల నిన్నంటడు. రేపు మమ్ములనంటడు. వీనికి ఇప్పుడే బుద్ధిచెప్పాలని ఊరు ఊరంతా ఒక్కటయింద్రు. పంచాది కోట్లాట ఏదీ లేదు. నువ్వు ఊర్లె కత్తిపట్టద్దు అన్నరు.

శేరెల్లి అన్నను తమ్మున్ని పిలిపించి వాళ్ళిద్ధరికే ఊరి మీద హక్కు ఉంటదని కాయిదం రాసి ఇచ్చింద్రు.

వాళ్లు మాత్రం రాసి ఇచ్చిన ఆ కాయితాన్ని ముక్కముక్కలు చింపి శేరెల్లి భుజం మీద చెయ్యేసి బయటకు నడిచింద్రు.

(ఆదివారం ఆంధ్రజ్యోతి ఆగష్టు-2004.)

( కథా వార్షిక-2004)

(తెలంగాణ కథ-2004)